క్లుప్తంగా

ప్రవీణ్‌కుమార్‌కు కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న ప్రవీణ్ కుమార్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి పి.ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి పర్యవేక్షణలో 'వీడియో బేస్డ్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ రికగ్నిషన్ ఎ డీప్ లెర్నింగ్ అప్రోచ్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ప్రవీణ్‌ను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

కృత్రిమ మేధతో సాంకేతిక విప్లవం



మల్లేశ్వరరావును అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఉపాధి అవకాశాలు' అనే అంశంపై విభాగ పూర్వ విద్యార్థి, అమెరికాలోని బ్రైట్ లింక్ సంస్థ సీఈవో డాక్టర్ వై.మల్లేశ్వరరావు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఏఐ, ఎంఐపై అవగాహన కల్పిస్తూ సాంకేతిక మార్పులకు ఇవి దోహదపడుతున్న విధానం వివరించారు. ఇంధన వెలికితీతలో వీటి ప్రాధాన్యతలను తెలియజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సీవీ నాయుడు, విభాగం అడ్జంక్ట్ ప్రొఫెసర్ జి. శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం డాక్టర్ వై.మల్లేశ్వరరావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. వర్సిటీ తరఫున మల్లేశ్వరరావును సత్కరించారు.

బీసీ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకట కుమారి తదితరులు

బీచ్‌రోడ్డు : జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఈ నెల 16వ తేదీన విశాఖలో నిర్వహించనున్న బీసీ గర్జన పోస్టర్‌ను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దివంగత ఎస్ఈ రాజారావుకు నివాళి



రాజారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రసన్నకుమార్ తదితరులు

మహారాణిపేట : విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన ప్రజారోగ్యశాఖ ఎస్ఈ కె.రాజారావు సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పాల్గొన్ని రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ నరసింహమూర్తి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ రామిరెడ్డి, వుడా సీఈ ఈ.శివప్రసాద్‌రాజు, పబ్లిక్ హెల్త్ ఏఈ గణపతిరావు, జీవీఎంసీ, ఇంజినీరు, ఇతర అధికారులు పాల్గొని నివాళులు అర్పించారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

- ఉచితంగా అందిస్తున్న దివ్యాంగుల సంక్షేమ శాఖ
- దరఖాస్తు చేసిన వారం రోజుల్లోనే అందజేత
- ఆర్‌సీడీ ఆస్పత్రి ఆవరణలోనే నిర్మితి కేంద్రం
- 2 నెలల్లో 30 కాలిపర్స్, 15 కృత్రిమ కాళ్ల తయారీ



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో నమూనా తయారు చేస్తూ..



కృత్రియ కాలు తయారీని వివరిస్తున్న ప్రభాకర్

ఏయూక్యాంపస్: దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందిస్తూ, వారు సాధారణ జీవితం గడిపేందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తోంది దివ్యాంగుల సంక్షేమ శాఖ. ప్రమాదంలో కాలు కోల్పోయినా, పోలియో కారణంగా వైకల్యం ఏర్పడినా జీవితాంతం చింతించనవసరం లేకుండా, ఆర్థికపరమైన భారం లేకుండా ఉచితంగా వాటిని అందిస్తోంది రాష్ట్రప్రభుత్వం. దరఖాస్తు చేసిన వారం రోజుల్లోనే నూతన కృత్రిమ అవయవాలను తయారు చేసి అందించే విధంగా పని చేస్తోంది పెద వాల్తేరులోని ఆర్‌సీడీ ఆసుపత్రి ఆవరణలో ఉన్న కృత్రిమ అవయవాల నిర్మితి కేంద్రం. ఎందరో దివ్యాంగులకు వరప్రదాయినిగా నిలుస్తోంది.

తమ కాళ్లపై తాము నిలబడేలా..

ప్రమాదాలలో గాయపడి లేదా అనారోగ్యంతో కొన్ని సందర్భాలలో వ్యక్తులకు కాలు తొలగించడం జరుగుతుంది. అటువంటి వారికి మనోధైర్యాన్ని అందిస్తూ.. తమ కాళ్లపై తాము నిలబడేందుకు అవసరమైన కృత్రిమ అవయవాలను ఉచితంగా తయారు చేసి అందిస్తున్నారు. కృత్రిమ కాళ్లు, పోలియో సోకిన వారికి క్యాలిపర్స్‌లను ఇక్కడ తయారు చేస్తున్నారు.

దరఖాస్తు ఇలా..

దివ్యాంగులు ఎవరైనా వీటిని దరఖాస్తు చేసుకోవచ్చు. పెదవాల్తేరులోని ఆర్‌సీడీ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తారు. సదరం సర్టిఫికెట్, డాక్టరు ఇచ్చిన ధ్రువపత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బీపీఎల్ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, మూడు ఫోటోలు తీసుకురావాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే ఆర్టిఫీషియల్ లింబ్స్, క్యాలిపర్స్‌ను తయారుచేసి ఉచితంగా అందిస్తున్నారు. గడచిన రెండు నెలల్లో 30 కాలిపర్స్, 15 కృత్రిమ కాళ్లు తయారు చేసి అందించారు. వీటి తయారీ ఖర్చు ప్రభుత్వమే పూర్తిగా భరిస్తూ, లబ్ధిదారులకు ఉచితంగా అదిస్తోంది.

ప్రతీ ఒక్కరికీ ప్రత్యేకం

ముందుగా దరఖాస్తు చేసుకున్న వ్యక్తి కాలి కొలతలు తీసుకుంటారు. వీటి ఆధారంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ఒక నమూనాను తయారు చేసుకుంటారు. అనంతరం దీనిని వ్యక్తి కాలికి సరిపోయే విధంగా పూర్తిస్థాయి నమూనా సిద్ధం చేస్తారు. హైపర్ టెన్షన్ పైప్‌ను 183 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వేడి చేసి పీవోపీ నమూనాపై ఎంతో శ్రమతో అతికిస్తారు. అనంతరం లోపల ఉన్న పీవోపీని తొలగించి, సాధారణ కాలు రూపంలో ఉండే కృత్రిమ కాలును తయారు చేస్తారు. దీనికోసం నిర్మితి కేంద్రంలో వల్లూరి ప్రభాకర్ నేతృత్వంలో మరో ఇద్దరు సిబ్బంది పని చేస్తున్నారు. కృత్రిమంగా తయారు చేసిన కాలు నమూనాలు సాధారణ కాలుతో సమానంగా ఉంటున్నాయి. నడవటం, నిత్యం తమ విధులను నిర్వహించుకోవడానికి వీలుగా వీటిని రూపొందిస్తున్నారు.

దివ్యాంగులు ఉపయోగించుకోవాలి



దివ్యాంగులకు అవసరమైన ఆర్టిఫీషియల్ లింబ్స్, క్యాలిపర్స్‌ని ఉచితంగా తయారు చేసి ఇస్తున్నాం. బీపీఎల్ పరిధిలో ఉన్నవారు నేరుగా మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వీరికి వారం రోజుల్లో కృత్రిమ అవయవాలను తయారు చేసి ఉచితంగా అందిస్తాం.

– జె.మాధవి, అసిస్టెంట్ డైరెక్టర్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల, సంక్షేమ శాఖ

శ్రీకాకుళం నుంచి వచ్చాం



మా అమ్మాయి నడవడానికి ఇబ్బంది పడుతోంది. తెలిసిన వారు చెప్పగా ఇక్కడికి వచ్చాము. కాలిపర్స్ తయారు చేసి అందించారు. పాపకు వీటితో నడవడం సులభమైంది. దివ్యాంగులకు ఎంతో ఉపయుక్తం.

– పి.కుమారి, శ్రీకాకుళం

సబ్సిడీ టమాటాకు తగ్గని డిమాండ్



వినియోగదారుల నుంచి ఆధార్ నంబరు నమోదు చేసుకుంటున్న రైతు బజార్ సిబ్బంది



సబ్సిడీ టమాటాల కోసం జనం బారులు

ఆరిలోవ : ఎంవీపీ రైతు బజార్‌లో సబ్సిడీ టమాటాల కోసం వినియోగదారులు బారులు తీరుతున్నారు. బయటి మార్కెట్‌లో టమాటా ధర తగ్గకపోవడంతో ప్రభుత్వం సబ్సిడీపై కిలో రూ.50కి అందించే టమాటాలకు బాగా డిమాండ్ పెరిగింది. దీంతో వీటి కోసం రోజూ వినియోగదారులు క్యూ కడుతున్నారు. శుక్రవారం మూడు టన్నులకు పైగా టమాటాల విక్రయం జరిగింది. రైతు బజార్ సిబ్బంది వినియోగదారుల నుంచి ఆధార్ నంబరు నమోదు చేసుకొని ఒక్కొక్కరికీ కిలో చొప్పున టమాటాలు విక్రయిస్తున్నారు. ఈనెల 2 నుంచి ఇంత వరకు సబ్సిడీపై 35 మెట్రిక్ టన్నుల టమాటా 35 వేల మంది వినియోగదారులకు విక్రయించినట్లు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు.

75 శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పించాలి

మద్దిలపాలెం : రాష్ట్రంలో నెలకొల్పుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ సహా అన్ని పరిశ్రమలలో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే కేటాయించాలని ఏపీ స్టేట్ ఓబీసీ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో కోరారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎక్కువగా వలసలు వెళ్తుతుంటారన్నారు. వాటిని అరికట్టడానికి స్థానికులకు అవకాశాలు కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ నెరవెర్చుతారని ఆశగా ఎదురు చూస్తున్నామన్నారు.

సంక్షేమ పాలనకు నిదర్శనమిది..

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకే 'జగనన్న సురక్ష'
- మేయర్ గొలగాని హరి వెంకట కుమారి
- 11వ వార్డులో 800 మందికి ధ్రువపత్రాల పంపిణీ



లబ్ధిదారుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న అక్కరమాని విజయనిర్మల



11వ వార్డులో లబ్ధిదారుకు కుల ధ్రువీకరణ పత్రం అందిస్తున్న మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్

ఆరిలోవ: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అధికారులే ప్రజల వద్దకు వచ్చి సర్టిఫికెట్లు అందిస్తున్నారని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. సంక్షేమ పాలనకు ఇది నిదర్శనమన్నారు. జీవీఎంసీ పదకొండో వార్డులో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలతో కలసి వార్డులో 800 మందికి ఆమె వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అర్హులై ఉండి అవసరమైన సర్టిఫికెట్లు లేక, సంక్షేమ పథకాలు అందుకోలేని వారికి అధికారులు తక్షణం సర్టిఫికెట్లు అందించే కార్యక్రమం చేపట్టారన్నారు. గత ప్రభుత్వంలో రోజులు, నెలలు తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా సర్టిఫికెట్ అందేది కాదని, ఇప్పుడు అధికారులే జగనన్న సురక్ష సభలో నేరుగా సర్టిఫికెట్లు అందిస్తున్నారని అన్నారు. మనమంతా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుకోవాలని తెలిపారు.

అర్హులందరికీ పథకాలు

వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల మాట్లాడుతూ కుల, ఆదాయ, వివాహ, తదితర ధ్రువపత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగి డబ్బులు ఖర్చు చేయకుండా జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. అర్హులైన పేదలందరికీ జగనన్న ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అవి ఎంతో విలువైనవని, వాటిని నిర్మించుకుని నివాసం ఉండాలని సూచించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని అందరూ ఆదరించాలని కోరారు. అనంతరం దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ మత్యరాజు, ఏఈ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, సూరిబాబు, షకీనా, జహంగీర్, పి.శ్రీహరి, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

19వ వార్డులో 600 మందికి సర్టిఫికెట్ల అందజేత..

ఎంవీపీకాలనీ : అన్ని వర్గాల ప్రజలకు సత్వర ప్రభుత్వ సేవలు, ఇంటింటికీ సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం 19వ వార్డులోని జాలరిపేటలో శుక్రవారం నిర్వహించారు. అక్కరమాని విజయ నిర్మల ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 19వ వార్డులో 600 మందికి పైగా పలు రకాల సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరాడ దాసు, పండరీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో మ్యారేజ్ సర్టిఫికెట్



నాకు ఈ ఏడాది మేలో వివాహం జరిగింది. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయాలనుకుంటున్న సమయంలో వలంటీర్ ఇంటికి వచ్చి ఏమైనా సర్టిఫికెట్ల అవసరముందా అంటూ అడిగారు. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయించారు. నాలుగు రోజులకే సర్టిఫికెట్ అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. అధికారులను ఎవరినీ కలవకుండా, ఎలాంటి ఖర్చు లేకుండా సర్టిఫికెట్ ఇచ్చారు.

– రూపా చంద్రిక, బాలాజీనగర్

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ఎలాంటి శ్రమ లేకుండా కుల, ఆదాయ ధ్రువపత్రాలు చేతికిచ్చారు. రెండు రోజుల క్రితం వలంటీర్ మా ఇంటికి వచ్చి సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయించారు. గతంలో వీటి కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరిగేవాళ్లం. సకాలంలో సర్టిఫికెట్లు అందక పనులు ఆగిపోయేవి. ఇప్పుడు రెండు, మూడు రోజుల్లో దగ్గరకు తీసుకొచ్చి, పిలిచి ఇస్తున్నారు. గతంలో ఇలా ఎప్పుడు సర్టిఫికెట్లు అందలేదు. ఇలాంటి సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– బి.శ్రీరాంమూర్తి, ఆరిలోవ

పది నిమిషాల్లో కుల ధ్రువపత్రం పొందాను..



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం 11 రకాల సేవలకు సర్టిఫికెట్లు పొందే విధంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం అభినందనీయం. ఈ క్యాంపు ద్వారా కుల ధ్రువీకరణ పత్రం పొందాను. సాధారణంగా కుల ధ్రువీకరణ పత్రం పొందడానికి 40 రోజుల సమయం పడుతుంది. అయితే ఈ క్యాంపు ద్వారా పది నిమిషాల్లోనే పొందడం ఆనందాన్నిచ్చింది. ఈ క్యాంపు ద్వారా అందిస్తున్న సేవలు చాలా ఉపయుక్తంగా ఉన్నాయి.

– స్వరూప, 19వ వార్డు

ఇంటి తలుపు తట్టి మేలు చేస్తున్నారు..



ఈ క్యాంపు ద్వారా ప్రజలందరికీ మేలు జరుగుతుంది. ముఖ్యంగా మహిళలు వారికి కావాల్సిన సర్టిఫికెట్లు పొందేందుకు వీలు ఏర్పడుతుంది. ఎలాంటి సర్టిఫికెట్ పొందాలన్నా రోజువారి పనులు మానుకుని తిరగాల్సి ఉండేది. అయితే జగనన్న సురక్ష క్యాంపు ద్వారా పది నిమిషాల్లోనే సర్టిఫికెట్ అందజేయడం ఆనందం కలిగించింది. అర్హత ఉన్న వారికి ఇంటి తలుపు తట్టి మరీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతోంది. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలి.

– పావని, 19వ వార్డు

స్ఫూర్తిప్రదాత దుర్గాబాయి దేశ్‌ముఖ్



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూక్యాంపస్ : మహిళా సాధికారతకు నిదర్శనంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ నిలుస్తారని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. నరసింహారావు అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జన్మదిన వేడుకల్లో భాగంగా కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ఎంపవర్‌మెంట్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని మహిళా అభ్యున్నతికి పాటుపడిన దుర్గాభాయి దేశ్‌ముఖ్ వ్యక్తిత్వం గురించి వివరించారు. కేంద్ర సంచాలకులు డాక్టర్ పి.ఉష మాట్లాడుతూ అంతర్గత నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటూ ప్రతి మహిళ విజయాన్ని అందుకోవాలన్నారు. రాంకీ ఫౌండేషన్ అధిపతి కె.శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళా సాధికారత, యుక్తవయసు కలిగిన బాలికల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్రం సలహాదారు పీల నాగ వెంకట లక్ష్మి, అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.పుల్లారావు, హిమబిందు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.సాంబశివరావు, కిరణ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రై డే తో వ్యాధులకు చెక్



ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్

మద్దిలపాలెం : దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ అన్నారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని జీవీఎంసీ 22వ వార్డు పీఠాపురంకాలనీలో ఆయన పరిశీలించారు. జీవీఎంసీ యాంటీ మలేరియా బృందం కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి పరిసరాలలో నీటి నిల్వలుంటే వాటిలో లార్వా ఉన్నదీ లేనిదీ గుర్తించాలని సూచించారు. ఇంట్లో ఉండే వారికి తగిన సూచనలు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం వారందరూ వారి ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారం పైబడి నీరు నిల్వ ఉంటే దోమలు ఉత్పత్తి అవుతాయనే విషయాన్ని వివరించాలన్నారు. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు అవుతుండడంతో యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. శుక్రవారం, మంగళవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ సూపర్‌వైజర్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ పెంటపల్లి గణేష్, యాంటీ లార్వా బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి



శివాజీపాలెం జీవీఎంసీ స్కూలు విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న అతిథులు

మద్దిలపాలెం : ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులు కథలు, కవితలు చదవడం ఇష్టపడేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ప్రముఖ కథా రచయిత మేడా మస్తాన్‌రెడ్డి అన్నారు. శివాజీపాలెంలో గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం «చదవడం నాకిష్టం» కార్యక్రమాన్ని విశాఖ సంస్కృతి సంపాదకుడు సన్యాసిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ చదవడంలో ఆసక్తి కలిగేలా కథలతో చూడిన పుస్తకాలు విద్యార్థులకు అందించాలన్నారు. అలాంటి పుస్తకాలు అంటే చదడానికి ఇష్టపడతారన్నారు. ఈ సందర్భంగా 100 ఆంగ్ల, తెలుగు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ పుస్తకాలు విద్యార్థులు చదివేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాకుమారి, ఉపాధ్యాయురాలు ఉమాగాంధీ, సన్యాసిరావు విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రయాన్ 3 ప్రసారాన్ని వీక్షించిన నగర బీజేపీ శ్రేణులు



ప్రోగ్రాంను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీకాలనీ : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 శాటిలైట్ లాంచింగ్ ప్రోగ్రాంను నగర బీజేపీ శ్రేణులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించాయి. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ నగర కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ ఈ ప్రయోగం విజయవంతం కావాలని యావత్ దేశం ఆకాంక్షిస్తుందన్నారు. ఇప్పటికే అంతరిక్ష ప్రయోగాల్లో ప్రత్యేక స్థానాన్ని సాధించిన ఇస్రో ఈ ప్రయోగం విజయవంతంతో ప్రపంచంలో అత్యుత్తమ సంస్థగా ఎదుగుతుంది అన్నారు. ఇస్రోకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ విశాఖ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి : పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ సిబ్బంది చేసిన కవాతును సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కవాతుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని, 8వ బెటాలియన్‌లో ఉన్నపుడు పరేడ్‌కు మరింత ప్రాధాన్యత ఇచ్చేవాడినన్నారు. 2006లో రాష్ట్ర స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పరేడ్ కమాండర్‌గా చేయడం కారణంగా తనకు కవాతుపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఏఆర్ సిబ్బంది చేసిన కవాతును, టర్న్ ఔట్‌ను అభినందించారు. ఏఆర్ సిబ్బంది బందోబస్తుల కంటే ఎక్కువగా ప్రిజన్ ఎస్కార్ట్ డ్యూటీలు, గార్డు డ్యూటీలు, వీఐపీ ఎస్కార్ట్‌లు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివాస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిబ్బందికి శాఖాపరమైన అంశాలలో ఏదైనా సమస్య ఉంటే నెలలో కచ్చితంగా ఒక శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని వివరించారు. సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రీవెన్స్ ఏర్పాటు చేసి 11 మంది నగర ఏఆర్ సిబ్బంది నుంచి వినతులు తీసుకొని వాటి పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 విద్యాసాగర్‌నాయుడు, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

బీచ్‌రోడ్డు: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. రామ్‌నగర్‌లోని ఓ ఆసుపత్రిలో పని చేస్తున్న వెంకట సూర్య (46) అదే ప్రాంతంలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. మద్యానికి అలవాటు పడిన సూర్య శుక్రవారం ఎవరూ ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెంటల్ కేర్ ఆసుపత్రికి మానసిక వికలాంగుడు

ఎంవీపీకాలనీ : వన్‌టౌన్ ప్రాంతంలోని ఓ ఏటీఎంలో విధ్వంసం సృష్టించి పరికరాలను ధ్వంసం చేయడంతో పాటు కరెంట్ వైర్లను కొరుకుతూ గాయాల పాలైన మానసిక వికలాంగుడిని పోలీసులు చినవాల్తేర్‌లోని మెంటల్ కేర్ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో వివరాలు తెలియని అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధుల సహకారంతో ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు అతనికి చికిత్స అందిస్తున్నారు.